# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

VC NEWS


TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శనివారం 31 మే 2025


వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 310

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో నేరగాళ్లను పట్టించే ఏఐ కెమెరాలు

2లో



## ప్రపంచ సుందరి ఎవరో?

**ప్రపంచ సుందరి-2025 ఎవరో తేలే సమయం ఆసన్నమైంది. విశిష్ట అతిథులు.. బాలీవుడ్ తారల ప్రదర్శనల నడుమ హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా శనివారం మిస్‌వరల్డ్ పోటీల ఫైనల్ జరగనుంది. కిరీటాన్ని సొంతం చేసుకునేందుకు 108 దేశాల అందాలభామలు పోటీపడుతున్నారు.**

**నేడు హైటెక్స్ వేదికగా మిస్ వరల్డ్ ఫైనల్**

**టాప్-40లో మిస్ ఇండియా నందిని గుప్తా**

**భారీ ఏర్పాట్లు.. బాలీవుడ్ తారల హాజరు.**

హైదరాబాద్: ప్రపంచ సుందరి-2025 ఎవరో తేలే సమయం ఆసన్నమైంది. విశిష్ట అతిథులు.. బాలీవుడ్ తారల ప్రదర్శనల నడుమ హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా శనివారం మిస్‌వరల్డ్ పోటీల ఫైనల్ జరగనుంది. కిరీటాన్ని సొంతం చేసుకునేందుకు 108 దేశాల అందాలభామలు పోటీపడుతున్నారు. మిస్ ఇండియా నందిని గుప్తా సహా 16 మంది సుందరీమణులు ఇప్పటికే టాప్ 40కి చేరుకున్నారు. మరో 24 మందిని న్యాయనిర్ణేతలు శనివారం ఎంపిక చేయనున్నారు. పలు దఫాల వడబోత అనంతరం చివరి దశలో అమెరికా-కరేబియన్, ఆఫ్రికా, యూరప్, ఆసియా-ఓషియానా ఖండాల నుంచి ఒక్కొక్కరిని ఎంపిక చేస్తారు. ఈ నలుగురిలో తుది ప్రశ్న ద్వారా మిస్‌వరల్డ్‌ను ప్రకటిస్తారు . మిస్ వరల్డ్ 2024 క్రిస్టినా పిజ్కోవా 72వ ప్రపంచ సుందరికి కిరీటాన్ని ధరింపజేస్తారు. ఫైనల్‌కు వేదికైన హైటెక్స్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్తు కాంతులతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.

## పార్టీలో పదేళ్లు ఎంతో ఆవేదన అనుభవించా

**భాజపాతో జతకట్టే పార్టీలకు రాజకీయంగా కొంతకాలం కలిసి వస్తుందేమో కానీ దీర్ఘకాలిక భవిష్యత్తు ఉండదని.. ఆ తర్వాత మరుగున పడటం ఖాయమని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అభిప్రాయపడ్డారు. ఇదే విషయాన్ని తాను కేసీఆర్‌కు చెప్పానన్నారు. పార్టీలో పదేళ్లుగా ఎన్నో ఆవేదనలను అనుభవించానని చెప్పారు.**

**నా లేఖను బహిర్గతం చేసినవారికి అది అంతర్గత అంశమని తెలియదా?**

**కొత్త పార్టీ పెట్టే ఆలోచన లేదు**

**భాజపాతో జతకట్టే పార్టీలకు భవిష్యత్తు ఉండదు: ఎమ్మెల్సీ కవిత**



ఆదిలాబాద్: భాజపాతో జతకట్టే పార్టీలకు రాజకీయంగా కొంతకాలం కలిసి వస్తుందేమో కానీ దీర్ఘకాలిక భవిష్యత్తు ఉండదని.. ఆ తర్వాత మరుగున పడటం ఖాయమని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అభిప్రాయపడ్డారు. ఇదే విషయాన్ని తాను కేసీఆర్‌కు చెప్పానన్నారు. పార్టీలో పదేళ్లుగా ఎన్నో ఆవేదనలను అనుభవించానని చెప్పారు. శుక్రవారం వివిధ ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మంచిర్యాలకు వచ్చిన ఆమె మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు.తెలంగాణను సాధించిన పార్టీని గుండెల్లో పెట్టుకొని కాపాడుకోవాలనేది తన తాపత్రయం తప్పితే కొత్త పార్టీ పెట్టాలనే ఆలోచన లేదని స్పష్టంచేశారు. 'ఏవైనా సమస్యలుంటే పార్టీలో అంతర్గతంగా చర్చించుకోవాలని.. గీతదాటొద్దని కొంతమంది అంటున్నారు. మరి నేను రాసిన లేఖ అంతర్గతమే కదా.. దాన్ని బయటపెట్టింది ఎవరు?' అని ప్రశ్నించారు. కేసీఆర్ భోజనం చేసే సమయంలోనూ ప్రజాసమస్యలపైనే చర్చిస్తారు తప్ప కుటుంబానికి, వ్యక్తిగత అంశాలకు తావీయరని.. అందుకే లేఖలు రాస్తానని కవిత చెప్పారు. "భవిష్యత్తులో ఏం జరుగుతుందో.. 20 ఏళ్ల ముందే పసిగట్టగలను. ఎంపీగా ఉన్నప్పుడే బీసీల రిజర్వేషన్లు, మహిళా బిల్లు అంశాలను పార్లమెంటు వేదికగా లేవనెత్తాలని కేసీఆర్ దృష్టికి తీసుకొచ్చా. అప్పుడు పట్టించుకోలేదు. ఇప్పుడేమైంది.. నేను ఆలోచించినట్లుగానే జరుగుతోంది కదా.. ఒకవేళ నేను చెప్పినట్లుగా ఆనాడే రాజకీయ విధానాన్ని ప్రకటించి ఉంటే ఆ పేరు భారాసకు వచ్చేది. సింగరేణిలో, పార్టీలో కొత్త నాయకత్వానికి అవకాశం కల్పించాలని చెప్పినా పట్టించుకోలేదు. చెప్పి లాభం లేదనుకొని తెలంగాణ జాగృతిలో కొత్తతరానికి అవకాశం కల్పించాం.

## భారాస ప్రభుత్వ పాలన దేశానికే దిక్సూచి



**దృఢ నాయకత్వం, ప్రజల జీవితాలను మార్చాలన్న చిత్తశుద్ధి ఉంటే.. అద్భుత ప్రగతి సాధ్యమని తెలంగాణ నిరూపించిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తొమ్మిదిన్నరేళ్ల భారాస ప్రభుత్వ పాలనలో తెలంగాణ సాధించిన విజయాలు దేశానికే దిక్సూచిగా నిలిచాయని ఆయన తెలిపారు.**

హైదరాబాద్: దృఢ నాయకత్వం, ప్రజల జీవితాలను మార్చాలన్న చిత్తశుద్ధి ఉంటే.. అద్భుత ప్రగతి సాధ్యమని తెలంగాణ నిరూపించిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తొమ్మిదిన్నరేళ్ల భారాస ప్రభుత్వ పాలనలో తెలంగాణ సాధించిన విజయాలు దేశానికే దిక్సూచిగా నిలిచాయని ఆయన తెలిపారు. స్థిరమైన వృద్ధితో ప్రపంచ ఆర్థిక రంగాన్ని నడిపించడంలో తెలంగాణ ఎందుకు ముఖ్యం? అన్న అంశంపై లండన్‌లో బ్రిడ్జ్ ఇండియా వీక్ 2025 సదస్సులో కేటీఆర్ శుక్రవారం కీలకోపన్యాసం చేశారు. అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో విప్లవాత్మక పంథాను అనుసరించి వివిధ రంగాల్లో తీసుకొచ్చిన మార్పులు, పాలసీలపై తన అనుభవాలు, ఆలోచనలను ఈ సదస్సులో కేటీఆర్ పంచుకున్నారు. "సంపదను సృష్టించడంతోపాటు.. దాన్ని సమాజంలోని అట్టడుగు వర్గాలకు సమానంగా పంచడమే మా హయాంలో తెలంగాణను దేశంలో ప్రత్యేకంగా నిలిపింది. కేసీఆర్ నాయకత్వంలోని మా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి మధ్య అద్భుత సమతౌల్యం సాధించింది. భారాస ప్రభుత్వం చేసిన ప్రగతిశీల పనులు స్వతంత్ర భారత చరిత్రలో ఏ రాష్ట్రంలో ఎవరూ చేయలేదు. విప్లవాత్మక మార్పులను ఆహ్వానించడంతోపాటు.. నిర్ణయాధికారాన్ని వికేంద్రీకరించడమే తెలంగాణను మిగతా రాష్ట్రాల కంటే ప్రత్యేకంగా మార్చింది"

## ఉగ్రచర్యలకు ప్రతీకారం తీర్చుకుంటామని వాగ్దానం చేసా

**పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలను ధ్వంసం చేస్తామంటూ బిహార్‌లోని మధుబన్‌లో నిర్వహించిన ర్యాలీలో ప్రకటించారు. నాడు ఇచ్చిన మాటకు కట్టు-బడి పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేశామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.**

**వాగ్దానాన్ని నెరవేర్చాక మళ్లీ ఇక్కడకు వచ్చా**

**ఆపరేషన్ సిందూర్‌తో పాక్ పీచమణిచాం**

**బీహార్ పర్యటనలో ప్రధాని మోడీ**

2లో..



## "ఇంజనీరింగ్" ఫీజుల పెంపును ఆపండి.

**ఉన్నత విద్యా మండలి కార్యాలయం వద్ద పీడీఎస్ యు నిరసన. పేద విద్యార్థులను విద్యకు దూరం చేసే విధానాలు మానుకోవాలని డిమాండ్. ఉన్నత విద్యా మండలి చైర్మన్, ప్రొఫెసర్ బాలకృష్ణ రెడ్డికి వినతి.**




2లో

## కాళేశ్వరంపై మరోమారు కుట్రలు

**ఈటెలతో హరీష్ రావు రహస్య భేటీ**

**కమిషన్ ముందు ఒక్కటే సమాధానం చెప్పాలని నిర్ణయం**

**కెసిఆర్ ఆదేశాలతోనే ఈటెలతో హరీష్ భేటీ**

**ట్రంప్ ఒత్తిడితో పాక్‌తో యుద్ధం విరమించడం దారుణం**

**పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఘాటు విమర్శలు**



హైదరాబాద్: కాళేశ్వరం కమిషన్ విషయంలో అంత ఒకటే సమాధానం చెప్పాలని హరీష్ రావు, ఈటెల రాజేందర్ అవగాహనకు వచ్చారని పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు షామిర్ పేటలో రహస్యంగా కలిశారని అన్నారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు ఒక ఫామ్ హౌస్ లో సీక్రెట్‌గా కలిశారని ఆరోపించారు. కేసీఆర్ చెప్పారు కాబట్టే హరీష్, ఈటల కలిశారన్నారు. కాళేశ్వరం కమిషన్ విషయంలో అంత ఒకటే సమాధానం చెప్పాలని మాట్లాడు కున్నారన్నారు. ఈ అంశంపై ఈటల రాజేందర్ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే అని వందసార్లు చెప్పామన్నారు. కవిత బీజేపీ మీద సర్జికల్ సర్జికల్ స్ట్రయిక్ చేస్తోందని.. దానిపై బీజేపీ సమాధానం చెప్పాలన్నారు. భాజపా, భారాస సయోధ్య గురించి కవిత ఇప్పుడు బయటపెడుతున్నారు. బండి సంజయ్‌ను భాజపా అధ్యక్ష పదవి నుంచి అన్యాయంగా తొలగించలేదా? భారాసతో దోస్తీకి అడ్డుగా ఉన్నందుకే సంజయ్‌ను తొలగించింది వాస్తవం కాదా? భాజపా నేతల ప్యాకేజీల గురించి రాజాసింగే చెబుతున్నారు. రాజాసింగ్ మాటలకు ఆ పార్టీ పెద్దలు సమాధానం చెప్పాలి.

## సైన్యం సాహసాన్ని తక్కువ చేస్తారా



2లో..

**ఆపరేషన్ సిందూర్‌పై విమర్శలా**

**పివోకెను పాక్ అప్పగించింది కాంగ్రెస్ కాదా**

**రేవంతక రాహుల్ విమర్శలు దేనికి సూచన**

**పాక్‌కు మద్దుతగా మాట్లాడడం దుర్మార్గం**

**కవిత వ్యవహారంతో బిజెపికి సంబంధం లేదు**



2లో..

## నేవీ రంగంలోకి దిగివుంటే పాక్ ముక్కలయ్యేది

**నేవీ మౌనంగా ఉంటూనే శత్రువుకు దడ పుట్టించింది**

**ఐఎన్ఎస్ విక్రాంత్‌పై నుంచి పాకిస్థాన్‌కు రాజ్‌నాథ్ వార్నింగ్**

# "ఇంజనీరింగ్" ఫీజుల పెంపును ఆపండి.

వేగుచుక్క న్యూస్, హైదరాబాద్, మే 30:




ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాల ఒత్తిడితో టిఏఎఫ్ఆర్ సి (తెలంగాణ అడ్మిషన్స్ అండ్ ఫీజ్ రెగ్యులేటింగ్ కమిటీ) ఫీజులు అధిక మొత్తంలో పెంచే ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని పిడియస్ యూ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యస్.అనిల్ డిమాండ్ చేశారు. పిడిఎస్ యు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం ఉన్నత విద్యా మండలి కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం చేపట్టి, నిరసన తెలిపారు. అనంతరం టెక్నికల్ విద్యార్థులపై ఫీజుల భారాన్ని పెంచే ఆలోచనలు విరమించుకోవాలనీ డిమాండ్ చేస్తూ, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కాంపాటి పృథ్వీ, యస్.అనిల్ మాట్లాడుతూ, ఇంజనీరింగ్ విద్యార్థులు కళాశాలలో ప్రవేశాల అవుతున్న సందర్భంలో పేద విద్యార్థుల వద్ద అధిక మొత్తంలో డొనేషన్స్ వసూలు చేస్తూ, ముందస్తుగా డిపాజిట్ చేసిన విద్యార్థులకు మాత్రమే కళాశాలలో అవకాశం కల్పిస్తున్నారన్నారు. దీని మూలంగా పేద విద్యార్థులు డొనేషన్స్ ఇవ్వలేక టెక్నికల్ విద్యకు దూరమవుతున్నారని తెలిపారు. విద్యార్థుల వద్ద నుండి లక్షల్లో ఫీజు డిమాండ్ చేసే ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాల గుర్తింపును రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న ఇంజనీరింగ్ కళాశాలలో టీచింగ్, నాన్ టీచింగ్ లేమితో సౌకర్యాలు లేకుండా నడుస్తున్న కళాశాల అనుమతులు రద్దు చేయాలని, ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా విద్యార్థుల వద్ద ఫీజులు డిమాండ్ చేయడం దుర్మార్గమన్నారు. ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యాలు మూడేళ్లకి ఒకసారి ఫీజు పెంపు విషయంలో కానీ కళాశాలలో కొత్త కోర్సులు మరియు సీట్ల పెంపు విషయంలో ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉండాలని వారు డిమాండ్ చేశారు. ఇష్టారాజ్యంగా ఫీజుల పెంపును కొనసాగిస్తే సహించేది లేదని వారు

హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి.డి.యస్.యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాకేష్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు డాక్టర్ కర్కగణేష్, వెంకటేష్ రాష్ట్ర నాయకులు నాగరాజు, అంగిడి కుమార్,అశూర్, హరీష్ పి డి యస్ యూ గ్రేటర్ హైదరాబాద్ జిల్లా నాయకులు నవీన్, సాయి ప్రశాంత్, అనిల్, పవన్, చెన్నకేశవులు, అభిరామ్, రామ్ రెడ్డి, శ్రీనివాస్, రత్న శేఖర్, అశ్విని, ఝాన్సీ, క్లారా తదితరులు పాల్గొన్నారు.



# ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌కు గట్టిగా బుద్ధి చెప్పాం

శ్రీనగర్: పాక్‌పై ప్రతీకార దాడిలో భరాత దళాల సామర్థ్యం అభినందనీయమని, మన సత్తా ఏమిటో చాటాని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. భారత్‌పై దాడిచేస్తే ధీటుగా సమాధానం ఇస్తామన్న ప్రధాని మోడీ ప్రకటన మేరకు పాక్‌కుమన దెబ్బను చూపామని అన్నారు. పాకిస్థాన్ దుశ్చర్యలను దీటుగా తిప్పికొట్టిన భారత సరిహద్దు భద్రతా దళాలపై అమిత్ షా ప్రశంసలు కురిపించారు. అలాగే కాశ్మీర్‌లో చేపట్టిన అభివృద్ధి కొనసాగుతుందన్నారు. దీనిని ఎవరూ అడ్డుకోలేరని అన్నారు. ఉగ్రదాడులతో ఆపాలనుకుంటే కఠినంగా జవాబిస్తామని హె÷-చరించారు. ఇటీవల చేపట్టిన సైనిక ఆపరేషన్ సమయంలో పాక్‌లోని 118 పోస్టులను మన దళాలు ధ్వంసం చేశాయని అన్నారు. వారి సమాచార, నిఘా నెట్‌వర్క్‌ను కూల్చివేశాయన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారిగా జమ్మూ కశ్మీర్‌లో పర్యటించిన ఆయన.. బీఎస్ఎఫ్ కొట్టిన దెబ్బకు శత్రుదేశం కోలుకునేందుకు ఏళు పట్టే అవకాశం ఉందన్నారు. ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా మనం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు ప్రతిస్పందనగా పాకిస్థాన్ సైన్యం మన సరిహద్దులోని పౌరులపై దాడులు చేసింది. వీటిని మన బీఎస్ఎఫ్ దళాలు దీటుగా తిప్పికొట్టాయి. దాదాపు 118 పాక్ పోస్టులను ధ్వంసం చేశాయి. శత్రువుల నిఘా వ్యవస్థను ఒక్కొక్కటిగా కూల్చివేశాయి. వాటిని పునరుద్ధరించేందుకు శత్రువులకు దాదాపు నాలుగు నుంచి ఐదేళ్లు పడుతుందని అమిత్ షా పేర్కొన్నారు. బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ నుంచి తనకు అందించిన సమాచారం ప్రకారం.. పాక్ సైనిక సమాచార, నిఘా వ్యవస్థలకు భారీ దెబ్బ తగిలిందన్నారు. కొంతకాలం పూర్తి సమాచార

ఆధారిత యుద్ధాన్ని చేసే పరిస్థితిలో వారు లేరన్నారు. ఈ సందర్భంగా బీఎస్ఎఫ్ సంసిద్ధతపై అమిత్ షా ప్రశంసలు కురిపించారు. అప్రమత్తంగా ఉంటూ స్పష్టమైన వ్యూహాలను విజయవంతంగా అమలు చేశారని కొనియాడారు. భారత సరిహద్దులో ఎటు-వంటి దాడులు జరిగినా మొదట ఆ భారాన్ని మోసేది బీఎస్ఎఫ్ జవాన్లేనని అన్నారు. జమ్మూ కశ్మీర్‌లో రెండు రోజుల పర్యటనలో భాగంగా.. ఇటీ-వల పాకిస్థాన్ జరిపిన దాడుల సందర్భంగా నష్టపోయిన కుటు-ంబాలను అమిత్ షా పరామర్శించారు. పాక్ దాడుల్లో దెబ్బతిన్న ఇళ్లు, వ్యాపార కేంద్రాలు, ప్రార్థనా మందిరాలకు సంబంధించిన పరిహార ప్యాకేజీని కేంద్రం త్వరలో ప్రకటిస్తుందన్నారు.

# నేవీ రంగంలోకి దిగివుంటే పాక్ ముక్కలయ్యేది



న్యూఢిల్లీ: పాకిస్థాన్‌కు భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాస్ వార్నింగ్ ఇచ్చారు. పాకిస్థాన్‌తో యుద్ధం జరిగినప్పుడు భారత నేవీ కనుక రంగలోకి దిగి ఉంటే.. పాకిస్థాన్ నాలుగు ముక్కలై ఉండేదని అన్నారు. యుద్ధం సమయంలో భారత నేవీ మౌనంగా ఉంటూనే.. శత్రువుల గుండెల్లో దడ పుట్టించిందని అన్నారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా నేవీ పాత్రను ఆయన కొనియాడారు. రాజ్‌నాథ్ సింగ్ శుక్రవారం ఐఎన్ఎస్ విక్రాంత్‌ను సందర్శించారు. ఐఎన్ఎస్ విక్రాంత్‌పై నిలబడి పాకిస్థాన్‌కు వార్నింగ్ ఇచ్చారు. కేంద్రమంత్రి రాజ్ నాథ్ సింగ్ మాట్లాడుతూ.. ' 1971లో భారత్, పాకిస్థాన్‌ల మధ్య యుద్ధం జరిగినప్పుడు భారత నేవీ కూడా యుద్ధంలో పాల్గొంది. భారత నేవీ దెబ్బకు పాక్ రెండుగా చీలిపోయింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత నేవీ రంగంలోకి దిగి ఉంటే.. ఈసారి పాక్ నాలుగు ముక్కలు అయ్యేది. ఆపరేషన్ సిందూర్ సమయంలో నేవీ మౌనంగా తన పని చేసుకుపోయింది. ప్రతీ భారతీయుడ్ని ఆశ్చర్యపరిచింది. మౌనంగా ఉంటూనే .. పాక్ ఆర్మీని ఓడించటంలో విజయవంతం అయింది. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా ఎయిర్‌ఫోర్స్ పాక్ టెర్రర్ బేస్‌లను ధ్వంసం చేసింది.

అప్పుడు భారత నేవీ బలగాలు ఎంతో దూకుడుగా అరేబియా మహా సముద్రంలో మోహరించాయి. పాక్ నేవీ.. నీటి సరిహద్దులు దాటి

ఇటు-వైపు రావడానికి ధైర్యం చేయలేకపోయింది. పాకిస్థాన్ చాలా అదృష్టం చేసుకుంది. ఒకవేళ ఆపరేషన్ సిందూర్ సమయంలో నేవీ రంగంలోకి దిగి ఉంటే పాక్ పరిస్థితి దారుణంగా ఉండేది. ఇప్పటి వరకూ జరిగిందంతా వామ్ అప్ మాత్రమే. ఈసారి పాకిస్థాన్ యుద్ధానికి దిగితే.. నేవీ కూడా రంగంలోకి దిగుతుంది. అప్పుడు పాక్ పరిస్థితి ఏమవుతుందో ఆ దేవుడికే తెలియాలని అన్నారు.

# ఉగ్రచర్యలకు ప్రతీకారం తీర్చుకుంటామని వాగ్దానం చేసా



పట్నా: పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేస్తామని బిహార్ పర్యటన సందర్భంగా గతంలో తానిచ్చిన హామీ నేరవేర్చానని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ప్రతిదాడి చేసి ప్రతీకారం తీర్చుకున్నామని అన్నారు. భారత్ మహిళల సిందూరం శక్తి ఎలా ఉంటుందో పాకిస్థాన్ చూసిందని ప్రధాని మోదీ అన్నారు. పాకిస్థాన్ ఆర్మీ తమకు రక్షణగా ఉందని ఉగ్రవాదులు భావిస్తున్నారని, వారికి సైతం భారత్ దెబ్బ ఎలా ఉంటు-ందో రుచి చూపించామని ఎద్దేవా చేశారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ బిహార్ రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం ఆయన కరకట్‌లో నిర్వహించిన భారీ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. శ్రీరాముడు ఒక్కసారి మాట ఇచ్చారంటే.. దానికి కట్టుబడి ఉంటారన్నారు. అదే విధానాన్ని తామూ అనుసరిస్తున్నట్లు తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి జరిగిన రెండో రోజు అంటే మే 24వ తేదీన బిహార్‌లో ప్రధాని మోదీ పర్యటించారు. ఈ సందర్భంగా పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలను ధ్వంసం చేస్తామంటూ బిహార్‌లోని మధుబన్‌లో నిర్వహించిన ర్యాలీలో ప్రకటించారు. నాడు ఇచ్చిన మాటకు కట్టు-బడి పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేశామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ వాగ్దానం చేసిన 35 రోజులకు మళ్లీ తాను బిహార్‌కు వచ్చానని ప్రధాని మోదీ చెప్పుకొచ్చారు. అంతేకాదు.. పాకిస్థాన్‌ను మోకాళ్లపై నిలబెట్టామని ప్రధాని మోదీ గుర్తు చేశారు. ఇది నయా భారత్ శక్తి అంటూ ఆయన అభివర్ణించారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాక్‌కు భారత్ శక్తి బాగా అర్థమైందన్నారు. అయితే ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ జరుపుతున్న పోరు ఆగలేదని స్పష్టం చేశారు. మరోసారి ఈ తరహా దాడి జరిగితే మాత్రం పాము తలను నాశనం చేస్తామని ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌ను ప్రధాని మోదీ పరోక్షంగా హెచ్చరించారు. మరికొన్ని నెలల్లో బిహార్

అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో వరుసగా మరోసారి అధికారం చేజిక్కించుకోవాలని ఎన్డీయే కూటమి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం బిహార్‌లో ఎన్డీయే కూటమి అధికారంలో ఉన్న సంగతి తెలిసిందే. జేడీయూ అధినేత నితీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 80 స్థానాలను గెలుచుకుని అతి పెద్ద పార్టీగా అవతరించింది. ఇవే ఎన్నికల్లో జేడీయూ 45 స్థానాలకు కైవసం చేసుకుంది. మిత్ర ధర్మంలో భాగంగా సీఎం పదవి నితీశ్ కుమార్ చేపట్టారు. అదీకాక.. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 29 స్థానాలను ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు గెలుచుకున్న విషయం విదితమే.

# ఉగ్రవాదులు మరణిస్తే సంతాపమా?

న్యూఢిల్లీ: ఉగ్రవాద దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన భారత పౌరుల పట్ల కనీస సానుభూతి వ్యక్తం చేయకపోగా.. భారత్ దాడుల తర్వాత పాక్‌లో చనిపోయినవారికి మాత్రమే సంతాపం తెలిపిన కొలంబియా ప్రభుత్వ వైఖరి తీవ్రంగా నిరాశపరిచిందని భారత ప్రతినిధి శశిథరూర్ వ్యాఖ్యానించారు.

ఆపరేషన్ సిందూర్‌కు దారితీసిన పరిస్థితులు, భారత్ తీసుకున్న చర్యలను కొలంబియా అధికారులకు వివరించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు శశిథరూర్ స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌లో ప్రాణాలు కోల్పోయిన వారికి కొలంబియా ప్రభుత్వం సంతాపం తెలపడంపై కాంగ్రెస్ నాయకుడు శశిథరూర్ అసహనం వ్యక్తం చేశారు. ఉగ్రవాదంపై పాకిస్థాన్ అనుసరిస్తున్న విధానాన్ని ఎండగట్టేందుకు భారత పార్లమెంటరీ అఖిలపక్ష ప్రతినిధి బృందాలు పలు దేశాల్లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. అందులో శశిథరూర్ నాయకత్వంలోని బృందం ప్రస్తుతం కొలంబియాకు వెళ్లింది. ఈక్రమంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాద దాడుల బాధితులపై సానుభూతి వ్యక్తపరచకుండా.. భారత్ దాడుల తర్వాత పాక్‌లో ప్రాణాలు కోల్పోయిన వారికి కొలంబియా ప్రభుత్వం సంతాపం తెలపడం మమ్మల్ని నిరాశ పరిచింది. మా ఆత్మరక్షణ హక్కును మాత్రమే మేము వినియోగించుకున్నాం. ఆపరేషన్ సిందూర్‌కు దారితీసిన పరిస్థితులను గురించి కొలంబియా అధికారులతో వివరంగా మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నాం. ఈ దేశం కూడా అనేక ఉగ్రదాడులను చూసింది. దాదాపు నాలుగు దశాబ్దాలుగా భారత్ అనేక దాడులను భరించింది. పాకిస్థాన్ తన సైనిక పరికరాలను వారి రక్షణ కోసం కాకుండా.. పక్క దేశాలపై దాడి కోసం వినియోగిస్తోంది.

# కాశ్మీర్ సమస్యను రగిల్చిందే కాంగ్రెస్

హైదరాబద్: స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు అయిన ఇంకా కశ్మీర్ సమస్య అలాగే ఉంది అంటే దానికి కారణం కాంగ్రెస్ పార్టీ కాదా అని ఎంపి ఈటెల రాజేందర్ ప్రశ్నించారు. కశ్మీర్ కి స్వతంత్రపతిపత్తి ఇచ్చి వివాదానికి ఆజ్యం పోసింది కాంగ్రెస్ పార్టీ కాదా అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రంగా స్పందించారు. ఆనాడు ఇందిర గాంధీ పాక్ ఆక్రమిత కశ్మీర్ ను స్వాధీనం చేసుకొని ఉంటే ఈనాడు భారత్ దేశానికి ఈ పరిస్థితి వచ్చి ఉండేదా అని నిలదీశారు. 370 ఆర్టికల్ ను రద్దుచేసి కశ్మీర్‌ని భారత దేశంలో అంతర్భాగం చేసిన ధీరుడు నరేంద్ర మోడీ అని..

మోడీ మీద విమర్శలు చేయడం సూర్యుని మీద ఉమ్మివేయడమనని తెలిపారు. ప్రపంచంలోనే నరేంద్ర మోడీ పెద్దన్న పాత్రను పోషిస్తున్నారని..

రష్యా ఉక్రెయిన్ యుద్ధం కూడా ఆగాలని కోరుకున్న వ్యక్తి మోడీ అని కొనియాడారు. సమస్య పరిష్కరించడం ముఖ్యమని.. దేశ భద్రత పట్ల కాంగ్రెస్ పార్టీ, ఆ పార్టీ నాయకులు మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్లే ఉందని దుయ్యబట్టారు. ప్రాసకోసం, రాజకీయంకోసం మీరు మాట్లాడుతున్న మాటలు సైనికుల ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. జైహింద్ పేరుతో సైనికుల కోసమని ర్యాలీ పెట్టి రాహుల్ గాంధీని ప్రధాని చేద్దాం అంటారు.. ఏం మాట్లాడుతున్నారో సోయి ఉండే మాట్లాడుతున్నారా అని మండిపడ్డారు. ఢిల్లీలో వెళ్లి మోడీని పొగుడుతారు.. గల్లీలో వచ్చి తిడతారని విమర్శించారు.. కేంద్ర ప్రభుత్వ చేస్తున్న పనులపై మీ మంత్రులు కొనియాడతారు.. మీరేమో తిడతారు.. ఇదేనా మీ నైజం? అని తీవ్రంగా మండిపడ్డారు. మల్కాజ్గిరి ప్రజలు అప్పట్లో గుండెల్లో పెట్టుకొని గెలిపించారని అంటున్నారు. అందుకేనా వారికి గుండె కోతను మిగుల్చుతున్నారు? అని ఎద్దేవ చేశారు. అందుకేనా హైడ్రాను తీసుకువచ్చి మల్కాజ్గిరి నియోజకవర్గంలో ఉన్న ప్రజల ఉసురు పోసుకుంటున్నారని, గుండెల్లో పెట్టుకుని.. అభిమానించినందుకేనా ఆత్మహత్యలు చేసుకొనేలా చేస్తున్నారని నిలదీశారు. రక్తాన్ని చెమటగా మలచి గెలిపిస్తే వారి రక్తాన్నే కళ్ళు చూస్తున్నారన్నారు. ప్రజల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారని.. మీకు ఓట్లు వేసి గెలిపించినందుకా? ప్రజల కన్నీళ్లు చూసి సంతోషపడుతున్నారన్నారు.

# కవిత పంచాయితీలో బిజెపిని ఎందుకు లాగుతారు



**బిఆర్ఎస్‌ను విలీనం చేసుకునే ఖర్మా మాకు పట్టలేదు**

**పదేళ్ల దోపిడీ చేసి...ఉద్యమకారులను అన్యాయం చేశారు**

**కాంగ్రెస్, టిడిపిలతో పొత్తు పెట్టుకున్నచరిత్ర వారిది**

**దమ్ముంటే కవిత మీడియా ముందు నిజాలు వెళ్లగక్కాలి**

**పాక్‌తో యుద్ధంపై రేవంత్ వ్యాఖ్యలు దుర్మార్గం**

**మీడియా సమావేశంలో బిజెపి ఎంపి రఘునందన్ రావు**

హైదరాబాద్: కవిత తన పంచాయితీ విషయాన్ని తండ్రి, అన్న కెటిఆర్÷-లతో తేల్చుకోవాలని, మధ్యలో బిజెపిని ఎందుకు లాగుతోందని ఆ పార్టీ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. బిఆర్ఎస్ వస్తామన్నా కలుపుకోవడానికి సిద్ధంగా బిజెపి లేదని స్పష్టం చేశారు. ఈముందని మిమ్ములను చేర్చుకుంటామని అన్నారు. బిజెపి తెలంగాణలో అధికారంలోకి వస్తుందని, కార్యకర్తలు కూడా అందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. అలాగే భాజపా ఎదుగుదలను ఆపాలని కుట్రలు పన్నుతున్నారని ఆ పార్టీ ఎంపీ రఘునందన్‌రావు ఆరోపించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా భారాస ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలపైనా ఆయన స్పందించారు.

చిట్‌చాట్‌లు ఎందుకు?.. ధైర్యముంటే ప్రెస్‌మీట్‌లు పెట్టండి. తప్పుడు వార్తలు రాయిస్తున్నారని చెప్పడం ఎందుకు? భారాసతో మా పార్టీ అధిష్ఠానం ఎప్పుడూ మాట్లాడలేదు. లేనిపోని పంచాయితీలు ఎందుకు?.. కుండబద్ధలు కొట్టినట్లు- చెప్పండి. చిట్‌చాట్‌ల పేరుతో మా పార్టీని వివాదంలోకి లాగొద్దని కవితకు విజ్ఞప్తి చేస్తున్నా. మీ సొంత పంచాయితీలు మీరే తేల్చుకోండి.. మమ్మల్ని లాగొద్దు. తెరాస గతంలో అనేక పార్టీలతో పొత్తు పెట్టుకుంది. 2004లో కాంగ్రెస్‌తో తెరాస పొత్తు పెట్టుకుంది. 2009లో మహా కూటమి పేరుతో పలు పార్టీలతో పొత్తు పెట్టుకుంది. 2014లో పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తామన్నది ఎవరు? భారాసతో భాజపా ఎప్పుడైనా పొత్తు పెట్టుకుందా? రాష్ట్రంలో భాజపా బలం పుంజుకుంటోంది.. కాంగ్రెస్ పార్టీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోతోంది. పార్లమెంటు ఎన్నికల్లో భారాస ఒక్క సీటూ గెలవలేదు. ఆ పార్టీ చెల్లని రూపాయిగా మారిందని ప్రజలు భావిస్తున్నారు. భాజపా, భారాస ఒక్కటనే తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత చెల్లని రూపాయి అయ్యారు. పదేళ్ల పాలనలో అమరుడు శ్రీకాంత్‌చారి కుటుంబానికి ఏమీ దక్కలేదు. తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన 1200 మంది అమరులను పట్టించుకోలేదు. కేసీఆర్ కుటుంబం పదేళ్లు దోచుకుంది. హరీశ్‌రావు భాజపా కోవర్టు అయితే మంత్రివర్గం నుంచి ఎందుకు సస్పెండ్ చేయలేదని అంటూ ప్రశ్నలు సంధించారు. భారాస బలహీనపడాలి

అనుకునేవాళ్లే కవిత వెనక ఉన్నారు. ఆమె కొత్త పార్టీ పెడుతోందని నాకు సమాచారముంది. భారాసకు అభ్యర్థులు లేక ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయలేదు. కోవర్టు పని చేసే వాళ్లు భాజపాలో ఉండరని రఘునందన్‌రావు వ్యాఖ్యానించారు. పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్‌అంశంపై కాంగ్రెస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై రఘునందన్ రావు తీవ్రంగా స్పందించారు. యుద్ధం చేసే ధైర్యం, దమ్ము ఉంటేనే మాట్లాడాలని హితవు పలికారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు బాధ్యతారహితంగా ఉన్నాయని ఆయన విమర్శించారు. యుద్ధం అనేది మాటలతో మాట్లాడేది కాదు.. అది చేసేటోనికి తెలుస్తుంది. రేవంత్ రెడ్డిది నెత్తి కాదు, కత్తి కాదు.. అంటూ ఆయన వ్యాఖ్యానించారు. దేశం ఏం అనుకుంటుందో మోడీకి తెలుసు. మోడీ నాయకత్వం ఎలా ఉంటుందో భారత ప్రజలకు తెలుసునని వ్యాఖ్యానించారు. పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌ను మోడీ నేతృత్వంలో భారత్‌కు కలిపే ధైర్యం బీజేపీకే ఉందని స్పష్టం చేశారు. ఇది రాజకీయ దురుద్దేశంతో

మాట్లాడే విషయం కాదు.. మోడీ ప్రభుత్వం పీఓకేను భారత్‌లో కలపడం కచ్చితంగా చేస్తుంది.

వేగుచుక్క

# మారనున్న అమీర్‌పేట రూపురేఖలు...

## మెట్రో స్టేషన్ దగ్గరకే బస్ స్టాప్

హైదరాబాద్: ట్రాఫిక్ కష్టాలు తీర్చేందుకు రేవంత్ సర్కార్ నడుం బిగించింది. అమీర్‌పేటలో రద్దీని తగ్గించేందుకు హెచ్ఎండీఏ 'మల్టీ మోడల్ ఇంటిగ్రేషన్' ప్రణాళికను సిద్ధం చేసింది. మెట్రో, బస్సు సర్వీసులను అనుసంధానం చేస్తూ, పార్కింగ్ స్థలాలను అభివృద్ధి చేయనున్నారు. అంతేకాకుండా ఫుట్‌పాత్ వ్యాపారాలను తరలించి, ప్రయాణికులకు సౌకర్యవంతమైన రవాణా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇది అమలైతే అమీర్‌పేట రూపురేఖలు మారిపోనున్నాయి. ఇక్కడ విజయవంతం అయితే.. నాంపల్లి, సికింద్రాబాద్ రూట్‌లో కూడా దీన్నే అమలు చేయనున్నారు

హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు రేవంత్ సర్కార్ చర్యలు తీసుకుంటుంది. దీనిలో భాగంగా హై సిటీ ప్రాజెక్ట్‌ని ప్రారంభించి.. రద్దీ ఉండే ప్రాంతాల్లో ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం చేపట్టేందుకు రెడీ అయ్యింది. వీటి కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయనుంది. ఇదిలా ఉంటే.. అమీర్‌పేట రూపురేఖలు మార్చేందుకు హెచ్ఎండీఏలోని యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ(ఉమ్టా) ప్రణాళికలు రెడీ చేసింది. ఆ వివరాలు..

నగరంలో విపరీతమైన రద్దీ ఉండే ప్రాంతాల్లో అమీర్‌పేట ఒకటి. పగలు, రాత్రి తేడా లేకుండా నిత్యం రద్దీతో కిటకిటలాడుతుంటుంది. ఇక్కడే మెట్రో ఇంటర్‌చెంజ్ స్టేషన్, బస్ స్టేషన్, పలు రహదారుల కలయిక ఉండటం వల్ల వాహనాల రద్దీ విపరీతంగా ఉంటుంది. ఈక్రమంలో అమీర్‌పేట ప్రాంతంలో ప్రజారవాణా వ్యవస్థను మెరుగుపరిచేందుకు ఉమ్టా రెడీ అవుతోంది. ఇందుకోసం మల్టీ మోడల్ ఇంటిగ్రేషన్ ప్లాన్‌ను ప్రతిపాదించింది. పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా అమీర్‌పేటలో దీన్ని అమలు చేసేందుకు ఉమ్టా రెడీ అవుతోంది. ఇది అమలయితే అమీర్‌పేట రూపురేఖలు మారుతాయి.



ఏపీలో మహిళలకు ప్రతి నెలా రూ.2వేలు ఉచితంగా.. ప్రభుత్వానికి సరికొత్త ప్రతిపాదన అంతేకాక దీని ఆధారంగా భవిష్యత్తులో నాంపల్లి, సికింద్రాబాద్ వంటి రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో మల్టీమోడల్ ఇంటిగ్రేషన్‌ను అమలు చేయాలని భావిస్తున్నారు. దీని కోసం ట్రాఫిక్, మెట్రో, టీజీఎస్ఆర్టీసీ, జీహెచ్ఎంసీ, పోలీసు శాఖలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు అడుగులు వేస్తోంది. ఏడాది నుంచి దీనిపై సమావేశాలు నిర్వహిస్తూ.. ఇప్పటికి ఓ కొలిక్కి తీసుకువచ్చారు.

మల్టీమోడల్ ఇంటిగ్రేషన్ ప్లాన్‌లో భాగంగా మెట్రో, బస్సు వివిధ ప్రజా రవాణా వ్యవస్థలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు. మెట్రో దిగిన వారు బస్సు.. బస్ దిగిన వారు మెట్రో ఎక్కేందుకు అనుకూలంగా చర్యలు తీసుకోనున్నారు. ఇందుకోసం 500 చదరపు మీటర్ల పరిధిని ప్రభావితంచేసేలా వాహనాల పార్కింగ్, ఫుట్‌పాత్ వ్యాపారాలు చేసుకోవడానికి అనువుగా ప్రణాళికలు రూపొందించారు.

అలానే స్వర్ణ జయంతి కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న బస్టాండ్లను మెట్రో స్టేషన్ సమీపంలోకి తీసుకువస్తే ఎలా ఉంటుందనే అంశంపై ప్లాన్ చేస్తున్నారు. పంజాగుట్ట-అమీర్‌పేట రోడ్డు మార్గంలో ఇరుపక్కలా మూడు లైన్ల రహదారి ఉన్నప్పటికీ.. ఫుట్‌పాత్ వ్యాపారాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. వీటిని సత్యం థియేటర్ సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలోకి మార్చేందుకు ప్రణాళికలు చేస్తున్నారు. ఇది అమలులోకి వస్తే.. పంజాగుట్ట-అమీర్‌పేట రోడ్డు పూర్తిగా ప్రజా రవాణాకు అందుబాటులోకి వస్తుందని భావిస్తున్నారు.

అలానే అమీర్‌పేటకు వచ్చే వారికి రెండు రకాల పార్కింగ్ జోన్లకు ప్లాన్ చేస్తున్నారు. అరగంటలోపు ఉంచే వాహనాలకు ఒకరకమైన పార్కింగ్, కొన్ని గంటల వరకు ఉంచే వాహనాలకోసం మరో రకమైన పార్కింగ్ జోన్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు.

# ఘనంగా "బీరప్ప" కళ్యాణ మహోత్సవం.

## పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ.





**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మే 30**

నగరంలోని బోర్గం (పి) వద్ద గల ఆలయంలో "బీరప్ప" కళ్యాణ మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ, తెలంగాణ లోని బీరప్ప ఆలయం ఇందూరులో ఉండటం అందరి అదృష్టం అని అన్నారు. మన సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించే శ్రీ బీరప్ప కళ్యాణ మహోత్సవం, ఇది కేవలం ఒక ఉత్సవం మాత్రమే కాదు ఇది మన కురుమ సమాజ గౌరవానికి, ఐక్యతకు, భక్తి శ్రద్ధలకు ప్రతీక అని అన్నారు. దేవుడికి కల్యాణానికి మధ్యలో మనం చేరి కలిసి పూజలు చేయడం ద్వారా, మన పరస్పరస బంధాలను మరింత బలపరిచే ఈ మహోత్సవం, అందరికీ సన్మార్గాన్ని శాంతిని శుభాన్ని కలిగించాలి అని తెలిపారు. ఈ పవిత్రమైన వేడుకల్లో పాల్గొనడాన్ని భాగ్యంగా భావిస్తున్నాను అని తెలిపారు. దగ్గరుండి ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్న మా సోదరుడు యాదాల నరేష్, దాయిని మోహన్, మహేష్, చిన్న కుర్మా మోహన్, కృష్ణ, యాదల మల్లయ్య, నవీన్, గొల్ల కురుమ ఆలయ కమిటీకి ధన్యవాదాలు తెలిపారు.

# అక్రమాలకు పాల్పడితే పార్టీ నుంచి తొలగిస్తాం.

**నియోజకవర్గంలో ప్రజలు ఏ సమస్య ఉన్న నేరుగా సంప్రదించండి.**

**కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి.**



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మే 30:**

అక్రమాలకు పాల్పడుతూ,అధికారుల పైన జులుం చేసే ఎవరినైనా ఉపేక్షించం అని, పార్టీ నుంచి సస్పెండ్ చేసి, చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం పివిఆర్ భవన్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇస్తున్న పథకాలు ప్రజలకు నేరుగా చేరుతాయని, ఎవరు కూడా మధ్యవర్తులను నమ్మకూడదని, నమ్మి డబ్బులు ఇవ్వవద్దని ఆయన నియోజకవర్గ ప్రజలకు సూచించారు. అలాగే బుధవారం రోజున కలెక్టరేట్లో జరిగిన సమావేశంలో ఇంచార్జ్ మినిస్టర్ జూపల్లి కృష్ణారావు ప్రజల సమస్యల గురించి సమావేశం నిర్వహించారు. దానిలో ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రాజీవ్ యువ వికాసం, దాన్యం కొనుగోళ్లపై నియోజకవర్గంలో ఎలా జరుగుతుందో అని అడిగి తెలుసుకున్నారని అన్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలో 3143 ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా ఇప్పటికే 800 ఇల్లులు ముగ్గు వేసి పని ప్రారంభించడం జరిగిందని, కొన్ని గ్రామాలలో మొదటి విడత లక్ష రూపాయలు బ్యాంకులోకి అర్హులకు వచ్చాయని తెలిపారు. మిగతా ఇల్లులు కూడా త్వరలో ప్రారంభించి పనులు పూర్తయ్యేలా చూస్తామన్నారు. అలాగే కొంతమంది పేద ప్రజలకు ఇల్లు కట్టుకోవడానికి ఇబ్బందిగా ఉంటే మహిళా సంఘాల ద్వారా రుణాలు ఇప్పిస్తామని తెలిపారు. రాజీవ్ యువ వికాసం మొదటి విడతలో 50,000, లక్ష రూపాయలు వారికి జూన్ రెండవ తారీఖున పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. ఈసారి వరి ధాన్యం పంట ఎక్కువ సాగు రావడంతో కాటా లేట్ అయిందని దాంతో కొద్దిగా ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు వచ్చాయని, అయినా సరే ప్రతి ధాన్యం గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేసి రైస్ మిల్లర్లతో ఏమైనా ఇబ్బంది ఉంటే ప్రభుత్వమే మాట్లాడి సమస్య పరిష్కారం చేస్తుందని ఆయన తెలిపారు. గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో, దినపత్రికలలో హేమంత చారి అనే వ్యక్తి దొంగ డాక్యుమెంట్లు పట్టాలు సృష్టించి బ్యాంకు లోన్లు ఇప్పిస్తున్నారని కథనాలు చదవడం జరిగిందని, ఆ కథనాలపై ఎంక్వయిరీ చేయించగా మాజీ ఎమ్మెల్యే తమ్ముడు బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆశన్న గారి రాజేశ్వర్ రెడ్డికి ఎస్బిఐ బ్యాంకులో నాలుగు కోట్ల 10 లక్షల రూపాయల లోని ఇప్పించడం జరిగిందని, అంతేకాకుండా హేమంత్ చారి దగ్గర దొంగ పత్రాలు సృష్టించి లోన్లు పొందిన వారు చాలామంది ఉన్నారని తెలిసిందని, దీనిపై ఏసీపీతో మాట్లాడడం జరిగిందని అన్నారు. అలాగే దీనిపై సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకునే విధంగా చూడాలని సిపిని కూడా కోరడం జరిగిందని అన్నారు.

# సీబీఎస్ఈ అనుమతుల పేరుతో తప్పుడు ప్రచారం.

**తల్లిదండ్రులు వాస్తవాలను తెలుసుకొని పాఠశాలల్లో చేర్పించాలి.**

**జిల్లాలో ఏడు పాఠశాలలకే మాత్రమే అనుమతులు.**

**సీబీఎస్ఈ అనుబంధ పాఠశాలల సంఘం ప్రతినిధులు వెల్లడి.**




**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మే 30:**

జిల్లాలో ని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు తాము సీబీఎస్ఈ అనుబంధమని, సీబీఎస్ఈ విధానాన్ని తాము అనుసరిస్తున్నామని తప్పుడు ప్రచారం చేస్తున్నాయని సీబీఎస్ఈ అనుబంధ పాఠశాలల సంఘం ప్రతినిధులు తెలిపారు. నగరంలోని ఎస్ఎస్ఆర్ డిస్కవరీ స్కూల్ లో శుక్రవారం సంఘం అధ్యక్షుడు సంతోష్ కుమార్, కార్యదర్శి ముజీబ్, సభ్యులు మారయ్యగౌడ్, పవన్ కుమార్, లక్ష్మీనర్సింహస్వామి విలేకరులతో మాట్లాడారు. సీబీఎస్ ఈ పేరుతో చాలా పాఠశా లలు విద్యార్థుల తల్లిదండ్రులను అయోమ యానికి గురి చేస్తున్నాయన్నారు. సీబీఎస్ఈ అనుబంధం కోసం దరఖాస్తు చేసుకున్న మాత్రాన సీబీఎస్ఈ అనుబంధ హోదా లభించదని స్పష్టం చేశారు. సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ నుంచి అధికారి కంగా అనుబంధం పొందిన పాఠశాలలకే సీబీఎస్ఈ పాఠశా లలుగా వ్యవహరించే హక్కు ఉందని పేర్కొన్నారు .జిల్లాలో సీబీఎస్ఈ అనుబంధ పాఠశాల లు నవ్యభారతి గ్లోబల్ స్కూల్, ఎస్ఎస్ ఆర్ డిస్కవరీ, ఎస్ఎస్ఆర్ స్కూల్(జన్నేపల్లి), నాలెడ్జ్ పార్క్ ఇంటర్నేషనల్ స్కూల్, ప్రెసిడెన్సీ స్కూల్, సెయింట్ ఆన్స్ స్కూల్(ఆర్మూర్), క్షత్రియ స్కూల్(ఆర్మూర్) మాత్రమేనని వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను స్కూళ్లలో చేర్పించే ముందు సీబీఎస్ఈ అధికారిక వెబ్ సైట్ లో పరిశీలించాలని సూచించారు.



# నిద్ర లేపి మరీ ఎనలైజర్ టెస్టులు..

తెలంగాణ: టీఎస్ఆర్టీసీలో విజిలెన్స్ అధికారులు అర్ధరాత్రి నిర్వహించే బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు కార్మికులను పీడిస్తున్నాయని జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న తెలిపారు. విశ్రాంతి తీసుకునే వేళలలో సిబ్బందిని ఇబ్బంది పెడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా పరీక్షించి, కేసులు బనాయిస్తున్నారని జేఏసీ నేతలు ఆరోపించారు. వెల్ఫేర్ బోర్డు సమావేశంలో యాజమాన్యం కార్మిక సంఘాలపై వ్యతిరేకత చూపించిందని.. ఇది నిరంకుశ విధానాలను చూపుతు ందని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని, కార్మికుల భయాందోళనలు తొలగించి, ఇచ్చిన హామీలు నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు.

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ)లో విజిలెన్స్ అధికారులు అర్ధరాత్రి వేళల్లో చేపడుతున్న బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు కార్మికులను తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నా యని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న మండిపడ్డారు. జేఏసీ కో-చైర్మన్ కె. హన్మంతు ముదిరాజ్, వైస్ చైర్మన్ ఎం. థామస్ రెడ్డిలతో కలిసి ఒక ప్రకటన విడుదల చేస్తూ.. ఈ పద్ధతి సరైంది కాదని స్పష్టం చేశారు.

ఆర్టీసీ ఉద్యోగులు పగలు శ్రమించి, రాత్రి వేళల్లో డిపోలలో విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో వారి నిద్రకు భంగం కలిగిస్తున్నారని జేఏసీ నాయకులు ఆరోపించారు. డ్యూటీలో లేని కార్మికులకు కూడా నాసిరకం బ్రీత్ ఎనలైజర్ మిషన్లతో బలవంతంగా పరీక్షలు నిర్వహించి.. కేసులు నమోదు చేస్తూ భయపెడుతున్నారని విమర్శించారు. ఏడీసీ, కంట్రోలర్, గ్యారేజీ సిబ్బందిని సైతం రాత్రి వేళల్లో ఇదే తరహాలో ఇబ్బందులకు గురిచేస్తూ వారి మానసిక ప్రశాంతతను దూరం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ నెల 27న జరిగిన వెల్ఫేర్ బోర్డు సమావేశంలో యాజమాన్యం బోర్డు సభ్యులను అడ్డుపెట్టుకుని, కార్మిక సంఘాలపై తమ వ్యతిరేకతను వెళ్లగక్కిందని జేఏసీ ఆరోపించింది. కార్మికులను యూనియన్లకు దూరం చేసే విధంగా సంఘాలపై ఉక్కుపాదం మోపే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టింది. యాజమాన్యం తమకు కార్మికులపై ప్రేమ ఉన్నట్లు పైకి చెబుతూనే, ఉద్దేశపూర్వకంగా వేధింపులకు పాల్పడుతోందని జేఏసీ నాయకులు ఫైర్ అయ్యారు.

ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా తమ హక్కుల కోసం నిజాయితీగా పోరాడే సంఘాలను కార్మికులు ఎప్పటికీ విడిచిపెట్టరని ఈదురు వెంకన్న స్పష్టం చేశారు. ఆర్టీసీ యాజమాన్యం రాచరికపు పాలనకు అలవాటు పడి, కార్మిక సంఘాలపై దుష్ప్రచారం చేస్తోందని, యూనియన్లు అవసరం లేదని ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు సమర్పిస్తూ పక్కదారి పట్టిస్తోందని ఆరోపించారు. ప్రతి డిపోలో ఇష్టారాజ్యంగా కిలోమీటర్ల పేరుతో పనిగంటలు పెంచుతూ, శ్రమకు తగ్గ ఫలితం ఇవ్వడం లేదని అన్నారు.

# 0006 నంబర్ కోసం రూ. 20 లక్షలు..




హైదరాబాద్: కూకట్‌పల్లి ఆర్టీఓ కార్యాలయంలో ఫ్యాన్సీ నంబర్లకు భారీ డిమాండ్ నెలకొంది. వేలం పాటలో 0006 నంబర్‌ను లాడియా డైమండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఏకంగా రూ.20.07 లక్షలు చెల్లించి దక్కించుకుంది. మొత్తం 15 నంబర్ల వేలం ద్వారా ఆర్టీఏకు రూ.34.17 లక్షల ఆదాయం వచ్చింది. వరంగల్‌లోనూ 9999 నంబర్‌ను కావేరీ ఇంజనీరింగ్ కంపెనీ రూ.12.60 లక్షలకు సొంతం చేసుకుంది.

ఫ్యాన్సీ నంబర్లకు ఉండే క్రేజ్.. ఇష్టమైన నంబర్ పొందడం కోసం లక్షల రూపాయలు ఖర్చు చేసే వారి గురించి ఈ మధ్య కాలంలో తరచుగా వింటూ ఉన్నాం. సెలబ్రిటీలు మొదలు సామాన్యుల వరకు చాలా మంది.. ఫ్యాన్సీ నంబర్ల కోసం భారీగా ఖర్చు చేస్తుంటారు. తాజాగా ఈ జాబితాలో మరో నంబర్ చేరింది. ఈ సారి కూకట్‌పల్లి ఆర్టీఓ కార్యాలయం ఇందుకు వేదికయ్యింది. 0006 నంబర్‌ను దక్కించుకోవడం కోసం ఏకంగా 20 లక్షల రూపాయలకు పైగా ఖర్చు చేశారు. మరి ఇంత భారీ మొత్తం ఖర్చు చేసి ఆ నంబర్‌ని దక్కించుకుంది ఎవరంటే..


గురువారం ఫ్యాన్సీ కార్ల నంబర్ వేలం నిర్వహించారు. దీనికి విశేష స్పందన లభించింది. మొత్తం 15 నంబర్లకు వేలం నిర్వహించారు అధికారులు. దీని ద్వారా కూకట్‌పల్లి ఆర్టీఓ కార్యాలయానికి ఒక్క రోజే రూ. 34.17 లక్షల ఆదాయం సమకూరింది. అధికారులు మొత్తం15 నంబర్లకు వేలం పాట నిర్వహించగా.. ఇందులో కేవలం 3 నంబర్ల ద్వారానే ఆర్టీఓ ఆఫీస్‌కు ఏకంగా రూ. 28.88 లక్షల ఆదాయం వచ్చింది.

ఒక్క నంబర్ ఏకంగా 20 లక్షల రూపాయల కు పైగా ధర పలికింది. అదే టీజీ 08ఏసీ 0006 నంబర్. లాడియా డైమండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ ఈ నంబర్ కోసం ఏకంగా రూ.20.07 చెల్లించింది. అలానే టీజీ 08క్యూ 9999 నంబర్ కోసం ఆరు లక్షల రూపాయలకు పైగా ఖర్చు చేశారు. రత్నదీప్ రిటైల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.6.80 లక్షలకు 9999 నంబర్‌ను దక్కించుకుంది. అలానే టీజీ 08ఏసీ 0001 అనే నంబర్ కోసం శ్రీశిక్ష ఎడ్యుకేషనల్ ట్రస్ట్ రూ. 2.01 లక్షలు చెల్లించి దాని సొంత చేసుకుంది. మొత్తానికి ఈ ఫ్యాన్సీ నంబర్ల వేలం పాట ద్వారా కూకట్‌పల్లి ఆర్టీఓ ఆఫీస్‌కు ఒక్క రోజులోనే కళ్లు చేదిరే ఆదాయం వచ్చింది. వరంగల్‌లో కూడా ఇలాంటి ఘటనే వెలుగు చూసింది. 9999 నంబర్‌కోసం భారీగా ఖర్చు చేశారు. హనుమకొండ కావేరీ ఇంజనీరింగ్ కంపెనీ.. 9999 ఫ్యాన్సీ నంబర్‌కోసం 2.60లక్షలు ఖర్చుచేసిన సంగతి తెలిసిందే.

వేగుచుక్క



# తెలంగాణ ప్రభుత్వానికి థ్యాంక్స్ చెప్పిన అల్లు అర్జున్..



తెలంగాణ ప్రభుత్వం గద్దర్ పేరుతో సినీ అవార్డులను ప్రకటించింది. 2024 సంవత్సరానికి గాను పలు విభాగాల్లో అవార్డులు ప్రకటించగా, గత పదేళ్లలో ఉత్తమ చిత్రాలను కూడా ఎంపిక చేశారు. 'పుష్ప 2' చిత్రానికి అల్లు అర్జున్ ఉత్తమ నటుడిగా ఎంపికవడంతో ఆయన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్టీఆర్ కూడా అవార్డులపై స్పందిస్తూ విజేతలకు అభినందనలు తెలియజేశారు. ఈ అవార్డుల ప్రదానోత్సవం తెలుగు చిత్ర పరిశ్రమకు ఒక ప్రత్యేక వేడుక కానుంది. తెలంగాణ ప్రభుత్వానికి థ్యాంక్స్ చెప్పిన అల్లు అర్జున్.. గద్దర్ అవార్డ్సపై ఎన్టీఆర్ స్పందన 2024 సంవత్సరానికిగాను దాదాపు 11 విభాగాల్లో అవార్డులు ఫిలిం అవార్డుల్ని ప్రకటించారు. అలానే 2014 నుంచి 2023 వరకు ఏడాదికో ఉత్తమ చిత్రాన్ని ఎంపిక చేసారు. వీటితో పాటు కొన్ని స్పెషల్ జ్యూరీ అవార్డులను అనౌన్స్ చేసారు. 2024 సంవత్సరంలో 'పుష్ప 2: ది రైజ్' చిత్రానికి గానూ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ 'బెస్ట్ యాక్టర్'గా ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో బన్నీ సోషల్ మీడియా వేదికగా తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసారు.

"గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్-2024 లో 'పుష్ప 2' చిత్రానికి ఫస్ట్ బెస్ట్ యాక్టర్ అవార్డును అందుకోవడం నాకు నిజంగా గౌరవంగా ఉంది. ఈ ప్రతిష్టాత్మక గౌరవానికి తెలంగాణ ప్రభుత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. నా దర్శకుడు సుకుమార్, నా నిర్మాతలు, మొత్తం 'పుష్ప' టీంకి ఈ క్రెడిట్ దక్కుతుంది. ఈ అవార్డును నా అభిమానులందరికీ అంకితం చేస్తున్నాను. మీ నిరంతర మద్దతు నాకు స్ఫూర్తినిస్తూనే ఉంటుంది" అని అల్లు అర్జున్ ఎక్స్ లో పోస్ట్ పెట్టారు.

యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ కూడా గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్ పై స్పందించారు. 'దేవర' సినిమాకి బెస్ట్ కొరియోగ్రాఫర్ అవార్డ్ వచ్చినందుకు అభినందనలు తెలియజేసారు. "గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్-2024 విజేతలందరికీ అభినందనలు. ఈ ఏడాది నుండి తెలంగాణ ప్రభుత్వం అవార్డులు ఇవ్వడానికి చొరవ తీసుకోవడం నిజంగా ప్రశంసనీయం. అలాగే, 'దేవర' చిత్రానికి బెస్ట్ కొరియోగ్రాఫర్ అవార్డును గెలుచుకున్నందుకు గణేష్ ఆచార్య జీకి అభినందనలు" అని తారక్ ఎక్స్ లో పేర్కొన్నారు. 14 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత 'గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్' రూపంలో తెలుగు చిత్ర పరిశ్రమకు పట్టం కట్టబోతున్నారు. 'లక్కీ భాస్కర్' సినిమా నాలుగు అవార్డులు సొంతం చేసుకోగా.. 'కల్కి 2898 '35 చిన్న కథలు' 'రాజు యాదవ్', 'కమిటీ కుర్రోళ్ళు' 'ఆయ్' 'రజాకార్' వంటి చిత్రాలు అవార్డులు గెలుచుకున్నాయి. వచ్చే నెల 14న అవార్డుల ప్రదాన కార్యక్రమం జరగనుంది.



# విజయ్ కోసం సూర్యకి హ్యాండ్..



బాలీవుడ్‌లో 'బేబీ జాన్'తో ఫెయిల్యూర్ చూసిన ఆమె, 'రౌడీ జనార్ధన్' మూవీ ద్వారా విజయ్ దేవరకొండ పక్కన టాలీవుడ్‌కి రీఎంట్రీ ఇస్తుందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇందులో కీర్తి గ్లామరస్ పాత్రలో కనిపించనుండగా, లిప్ లాక్ కూడా ఉండనుందట. అదే సమయంలో సూర్యతో వెంకీ అట్లూరి చిత్రం కోసం సంప్రదించగా ఆమె విజయ్ చిత్రానికే ఓకే చెప్పినట్లు టాక్. యువ హీరోలతో అవకాశాలు పెరుగుతాయని కీర్తి ఆలోచన అంటున్నారు.

'మహానటి'తో జాతీయ ఉత్తమ నటిగా అవార్డు అందుకున్న మలయాళ బ్యూటీ కీర్తి సురేష్ కొంతకాలంగా తెలుగు తెరకు దూరమైన సంగతి తెలిసిందే. గతేడాది వివాహం చేసుకున్న ఈ అమ్మడు 'బేబీ జాన్'తో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన తొలి సినిమాతో ఫ్లాప్ మూటగట్టుకున్నా అవకాశాలు బాగానే వస్తున్నాయి. మరోవైపు తనకు ఇంత గుర్తింపు ఇచ్చిన తెలుగు తెరపై మెరిసేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే ఆమెకు రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ పక్కన 'రౌడీ జనార్ధన్' మూవీలో ఛాన్స్ దక్కినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. 'రాజావారు రాణిగారు' ఫేమ్ రవికిరణ్ కోలా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత దిల్ రాజు నిర్మిస్తున్నారు.

ఈ మూవీలో గతంలో ఎన్నడూ లేని విధంగా కీర్తి ఫుల్ గ్లామర్ రోల్‌లో నటించనుందట. అంతేకాదు తన కెరీర్లోనే తొలిసారి విజయ్ దేవరకొండతో లిప్ లాక్ చేయనుందని టాక్. అయితే కీర్తి సురేష్‌కి సంబంధించి మరో వార్త ఇప్పుడు హల్‌చల్ చేస్తోంది. సార్, లక్కీ భాస్కర్ చిత్రాలతో వరుస బ్లాక్‌బస్టర్లు అందుకున్న వెంకీ అట్లూరి ప్రస్తుతం సూర్యతో ఓ మూవీ చేస్తున్న సంగతి తెలిసిందే. సూర్యకిది 46వ సినిమా. ఇందులో హీరోయిన్‌గా మేకర్స్ కీర్తి సురేష్‌ని సంప్రదించారట. అదే సమయంలో 'రౌడీ జనార్ధన్'లో విజయ్ దేవరకొండ పక్కన ఛాన్స్ రావడంతో విజయ్‌తో మూవీకే మొగ్గు చూపించదట.

సూర్య లాంటి స్టార్ హీరో పక్కన చేయకుండా విజయ్ సినిమాకు సైన్ చేయడం కీర్తి అమాయకత్వం అని కొందరు అంటుంటే.. సీనియర్ హీరో కంటే విజయ్ లాంటి యంగ్ హీరోతో చేస్తే మరింత మంది యువ హీరోలతో ఛాన్సులు వస్తాయన్నది ఆమె స్కెచ్ అని కొందరంటున్నారు. తెలుగులో మళ్లీ పాగా వేసేందుకు ప్రయత్నిస్తోన్న ఆమెకు విజయ్ దేవరకొండే కరెక్ట్ అని ఫిక్స్ కావడం వల్ల సూర్యతో ఛాన్స్ మిస్ చేసుకుని ఉండొచ్చని అభిప్రాయపడుతున్నారు. కీర్తి సురేష్.. సూర్యతో గతంలో 'గ్యాంగ్' అనే సినిమా నటించింది. అయితే ఈ మూవీ ఫ్లాఫ్ కావడంతో ఈ జంటని ప్రేక్షకులు పట్టించుకోలేదు. రీసెంట్‌గా 'రెట్రో' ఓ మోస్తరు హిట్ కొట్టి సూర్య వెంకీ అట్లూరి డైరెక్షన్లో తొలిసారి డైరెక్ట్ తెలుగు సినిమాలో నటిస్తున్నారు. దీన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు.

# కమల్ నాకు తండ్రిలాంటి వారు

కన్నడ భాషకు మూలం తమిళమేనన్న కమల్ హాసన్ వ్యాఖ్యలు పెద్ద దుమారానికి దారితీశాయి. తమిళం మీద ప్రేమ చూపించడంలో తప్పు లేదు గానీ, కన్నడను కించపరిచినట్లు మాట్లాడటం పట్ల కన్నడిగులు మండిపడ్డారు. వెంటనే కమల్ స్పందించి తాను ప్రేమతోనే ఆ వ్యాఖ్యలు చేశానన్నారు . అయితే ఈ వివాదంపై స్పందించిన శివన్న, " కమల్ హాసన్ నాకు తండ్రిలాంటి వారు. భాష పట్ల ప్రేమను స్థిరంగా చూపించాలి " అన్నారు.

ఇటీవల కాలంలో సినీ సెలబ్రెటీలు చేస్తోన్న కొన్ని వ్యాఖ్యలు వివాదాలకు దారితీస్తోన్న సంగతి తెలిసిందే.ఈ కోవలోనే విశ్వనటుడు కమల్ హాసన్ 'థగ్ లైఫ్' ఈవెంట్లో చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారమే రేపాయి. కన్నడ భాషకు మూలం తమిళమేననీ, తమిళం నుంచే



కన్నడ పుట్టిందని కమల్ అన్నారు. దీంతో కమల్ హాసన్‌పై కన్నడిగులు విరుచుకుపడ్డారు. చరిత్ర తెలియకపోతే నోరు మూసుకుని ఉండాలి గాని.. పిచ్చిపిచ్చిగా వాగితే తాట తీస్తామంటూ కమల్‌కి వార్నింగులు ఇస్తున్నారు. తమిళం మీద ప్రేమ ఉంటే చూపించుకోవాలి గానీ కన్నడ భాషని కించపరుస్తారా? అని రాజకీయ నేతలు, కన్నడ భాషా ప్రియులు ఆయనపై మండిపడుతున్నారు. కమల్ హాసన్ వెంటనే కన్నడ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ వివాదంపై స్పందించిన కమల్ హాసన్.. తాను చేసిన వ్యాఖ్యలు ప్రేమతో చేసినవే గానీ.. తనకు వేరే ఉద్దేశం లేదని అన్నారు.

అయితే కమల్ హాసన్ కన్నడ భాషపై మాట్లాడిన సమయంలో అక్కడ కన్నడ సూపర్‌స్టార్ శివ రాజ్‌కుమార్ ఉండటంతో కొందరు ఆయన్ని ట్రోల్ చేస్తున్నారు. అమ్మలాంటి భాషని పరాయి భాషా నటుడు అవమానిస్తుంటే చూస్తూ ఎలా ఊరుకున్నారని నిలదీస్తున్నారు. తాజాగా ఈ వివాదంపై శివన్న స్పందిస్తూ.. కమల్ హాసన్ తనకు తండ్రి లాంటి వారని అన్నారు. 'చిన్నప్పటి నుంచి నేను కమల్ హాసన్‌ని చూస్తు పెరిగాను. ఆయన నాకు తండ్రిలాంటి వారు. ఎవరైనా సరే కన్నడ బాష పట్ల తాత్కాలికమైన ప్రేమ కాకుండా స్థిరమైన ప్రేమ వ్యక్తపరచాలి. భాష, సంస్కృతి కోసం మీరేం చేస్తున్నారో ప్రశ్నించుకోండి. ఏదైనా వివాదాలు పెంచేందుకు కన్నడ భాషపై ప్రేమ కలిగి ఉన్నట్లు చూపించడం కరెక్ట్ కాదు. కన్నడ భాష, సినిమాలను ప్రోత్సహించడంపై రాజ్‌కుమార్ అభిమానులు, మీడియా చర్చిస్తున్న సారాంశాన్ని తప్పుగా అర్థం చేసుకోవద్దని కోరుతున్నారు. కమల్ హాసన్ వ్యాఖ్యలపై నేను తీర్పు చెప్పాలనుకోవడం లేదు. దానికి బదులుగా కన్నడ భాష, సినిమాలను ప్రతి ఒక్కరు ప్రోత్సహించాలి' అని కోరారు.

ఈ వివాదంపై కమల్ హాసన్ స్పందిస్తూ... ఎందరో చరిత్రకారులు భాషల చరిత్ర గురించి నాకు చెప్పారు. నేను చేసిన వ్యాఖ్యల్లో ఎలాంటి దురుద్దేశం లేదు. అవి ప్రేమతో అన్న వ్యాఖ్యలు మాత్రమే. ప్రతి ఒక్కరిని కలుపుకునే తత్వం ఉన్న అరుదైన రాష్ట్రం తమిళనాడు. ఒక మీనన్, ఒక రెడ్డి ముఖ్యమంత్రులు అయ్యారంటూ పరోక్షంగా ఎంజీ రామచంద్రన్, ఒమందూర్ రామసామి రెడ్డియార్‌లని ఉద్దేశించి కమల్ వ్యాఖ్యానించారు. అంతేకాకుండా మైసూర్ సంస్థానంలో పనిచేసిన నరసింహన్ రంగచారి మనవరాలు సీఎం అయ్యారని జయలలితను ఉద్దేశిస్తూ వ్యాఖ్యలు చేశారు.

# 4 గంటల్లోనే డబ్బింగ్ పూర్తి చేసిన పవన్ కళ్యాణ్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన 'హరి హర వీరమల్లు' సినిమా ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. షూటింగ్ కంప్లీట్ చేసుకొని పాన్ ఇండియా రిలీజ్ కు రెడీ అవుతోంది. జూన్ 12న ఈ చిత్రం తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. మరో రెండు వారాల్లో థియేటర్లలోకి రాబోతున్న ఈ సినిమాకి సంబంధించి ఓ అప్డేట్ ను మేకర్స్ పంచుకున్నారు. పవన్ కళ్యాణ్ అన్‌స్టాపబుల్ గా డబ్బింగ్ చెప్పారని తెలిపారు.



పవన్ కళ్యాణ్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో ఆయన హీరోగా నటిస్తున్న సినిమాల పనులు నత్తనడకన సాగుతూ వచ్చాయి. పూర్తిగా రాజకీయాలకే సమయం కేటాయించడంతో, ఎక్కడ షూటింగులు అక్కడ నిలిచిపోయాయి. అయితే ఇటీవలే పవన్ తిరిగి సెట్స్ లో అడుగుపెట్టారు. ఇప్పటికే 'హరి హర వీరమల్లు' సినిమా షూటింగ్ పూర్తి చేసి, రిలీజ్ కు రెడీ చేసారు. లేటెస్టుగా డబ్బింగ్ పనులు కూడా కంప్లీట్ చేశారు.

'హరి హర వీరమల్లు' సినిమా మరో రెండు వారాల్లో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. జూన్ 12న తెలుగు తమిళ హిందీ కన్నడ మలయాళ భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా భారీ ఎత్తున థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. మరోవైపు మిగిలి ఉన్న పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ ఫినిష్ చేస్తున్నారు. ఇందులో భాగంగా పవన్ కళ్యాణ్ తన పాత్రకు సంబంధించిన డబ్బింగ్ పూర్తి చేసినట్లుగా మేకర్స్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. నాలుగు గంటల్లోనే మొత్తం డబ్బింగ్ చెప్పారని తెలిపారు.

"పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అన్‌స్టాపబుల్ ఫోకస్, ఫైర్ తో 'హరి హర వీరమల్లు' డబ్బింగ్ పూర్తి చేశారు. ఎంతో బిజీగా ఉన్నప్పటికీ, షూటింగ్ ముగించిన తర్వాత రాత్రి 10 గంటలకు డబ్బింగ్ ప్రారంభించి, కేవలం 4 గంటల్లోనే మొత్తం డబ్బింగ్ పూర్తి చేశారు. పవర్ తుఫానుకు రెడీగా ఉండండి. జూన్ 12న సినిమా థియేటర్లలో అడ్రినలిన్‌తో నిండిన రైడ్ కోసం వేచి చూడండి" అని చిత్ర బృందం ఎక్స్ లో పోస్ట్ పెట్టారు. పవన్ షూటింగ్ చేసి వచ్చి, అర్ధరాత్రి 2 గంటల వరకూ ఏకధాటిగా డబ్బింగ్ చెప్పినట్లుగా తెలుస్తోంది.

18వ శతాబ్దం నాటి కథాంశంతో పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా 'హరి హర వీరమల్లు' రూపొందుతోంది. ఇందులో పవన్ కళ్యాణ్ సరసన నిధి అగర్వాల్ హీరోయిన్ గా నటిస్తోంది. బాబీ డియోల్ కీలక పాత్రలో కనిపించనున్నారు. నాజర్, అనుపమ్ ఖేర్, సత్యరాజ్, ఆదిత్య మీనన్, నోరా ఫతేహి ఇతర పాత్రల్లో నటించారు. మెగా సూర్య ప్రొడక్షన్స్ బ్యానర్ లో ఏఎం రత్నం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఫస్ట్ పార్ట్ ను 'స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో రిలీజ్ చేస్తున్నారు.

# వినాయక చవితికి 'మాస్ జాతర'..

రవితేజ, శ్రీలీల జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'మాస్ జాతర'. సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై భోగవరపు భాను దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాను సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. తొలుత ఈ సినిమాని మే 9న విడుదల చేయాలనుకున్నా, పవన్ కళ్యాణ్ 'హరి హర వీరమల్లు' కారణంగా వాయిదా వేశారు. అయితే ఇప్పుడు వినాయక చవితి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురాడానికి సన్నాహాలు చేస్తున్నారు. గురువారం రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేసారు.

రవితేజ, శ్రీలీల జోడీగా 'ధమాకా' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్టు కొట్టారు. ఇప్పుడు 'మాస్ జాతర' అనే మరో చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అవుతున్నారు. సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ లో రూపొందుతోన్న ఈ సినిమాతో భోగవరపు భాను అనే కొత్త దర్శకుడు ఇండస్ట్రీకి పరిచయం కాబోతున్నారు. మాస్ మహారాజా ఫ్యాన్స్ ఈ మూవీ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఎప్పుడు విడుదల చేస్తారా అని ఆలోచిస్తున్న తరుణంలో, మేకర్స్ తాజాగా రిలీజ్ డేట్ ను ఫిక్స్ చేశారు.

అన్నీ అనుకున్నట్లు జరిగితే 'మాస్ జాతర' సినిమా ఈపాటికే థియేటర్లలోకి రావాల్సి ఉంది. అలా జరగలేదు కాబట్టే వాయిదా పడింది. ముందుగా ఈ చిత్రాన్ని మే 9న రిలీజ్ చేయాలని భావించారు. కానీ అదే తేదీకి పవన్ కళ్యాణ్ 'హరి హర వీరమల్లు' మూవీని విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. దీంతో అందరూ ఊహించినట్లుగానే రవితేజ సినిమా వెనక్కి వెళ్ళింది. వీరమల్లు కూడా అనుకున్న సమయానికి రాలేదు, అది వేరే విషయమనుకోండి. లేటెస్టుగా సితార టీమ్ కొత్త విడుదల తేదీని అనౌన్స్ చేసారు. 'మాస్ జాతర' సినిమాని ఆగస్ట్ 27న గ్రాండ్ గా రిలీజ్ కానుందని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా వదిలిన అనౌన్స్ మెంట్ పోస్టర్ మాస్ రాజా ఫ్యాన్స్ కి మాంచి కిక్కెక్కించింది. వింటేజ్ రవితేజ ఈజ్ బ్యాక్ అంటూ ఖుషీ అవుతున్నారు. ఈ ఏడాది ఆగస్టు 27న వినాయక చవితి ఫెస్టివల్ ఉంది. అందులోనూ పండగ బుధవారం కావడంతో ఐదు రోజుల లాంగ్ వీకెండ్ ను క్యాష్ చేసుకోడానికి అవకాశం దొరుకుతుంది. హిట్ టాక్ వస్తే బాక్సాఫీస్ దగ్గర భారీ వసూళ్లు గ్యారంటీ.



ఇప్పటికైతే రవితేజ సినిమా ఒక్కటే వినాయక చవితికి షెడ్యూల్ చేయబడింది. పండక్కి సోలో రిలీజ్ డేట్ దొరక్కపోవచ్చు. రానున్న రోజుల్లో మరికొన్ని సినిమాలు విడుదల తేదీలను ప్రకటించే అవకాశం ఉంది. 'మాస్ జాతర' సినిమాలో రవితేజ పోలీసాఫీసర్ గా కనిపించనున్నారు. ఇప్పటికే రిలీజైన ప్రచార చిత్రాలు, గ్లింప్స్, ఫస్ట్ సింగిల్ ఆకట్టుకున్నాయి. రవితేజ గత కొంతకాలంగా వరుస ఫ్లోప్స్లో ఉన్నారు. ఈసారి ఎలాగైనా స్ట్రాంగ్ కంబ్యాక్ ఇవ్వాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఏం జరుగుతుందో చూడాలి. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్న 'మాస్ జాతర' సినిమాకి భీమ్స్ సంగీతం సమకూరుస్తున్నారు. విధు అయ్యన్న డీఓపీగా వర్క్ చేస్తున్నారు. నవీన్ నూలి ఎడిటర్ గా.. శ్రీ నాగేంద్ర తంగాల ఆర్ట్ డైరెక్టర్ గా వర్క్ చేస్తున్నారు.

# కస్తూరీ శంకర్ కష్టాలివే

కస్తూరీ శంకర్ సోషల్ మీడియాలో ఎంత యాక్టివ్‌గా ఉంటారో అందరికీ తెలిసిందే. కస్తూరీ శంకర్ వేసే పోస్టులు ఎక్కువగా కాంట్రవర్సీకి దారి తీస్తుంటాయి. ఇక తాజాగా కస్తూరీ శంకర్ తనకు కలిగిన అసౌకర్యం గురించి స్పందించారు. తాను ఆర్డర్ పెట్టిన వస్తువులు రాలేదని, డబ్బులు కూడా రీ ఫండ్ చేయలేదంటూ జియో మార్ట్ సేవల మీద ఆగ్రహం వ్యక్తం చేశారు. జియో మార్ట్ సేవల మీద కస్తూరీ కంటిన్యూగా ట్వీట్లు వేస్తూనే ఉన్నారు. చివరగా వారు స్పందించి డబ్బులు రీఫండ్ లేదా వస్తువుల్ని పంపిస్తామని చెప్పారట. జియో మార్ట్‌లో షాపింగ్ అనేది భయంకరంగా మారింది.. ఆన్ లైన్‌లో ఆర్డర్ చేశాను.. డెలివరీ చేసే వ్యక్తి మాత్రం వాటిని నా వద్దకు తీసుకు రాలేదు.. మధ్యలో మాయం చేశారు.. నేను ఆ విషయాన్ని రిపోర్ట్ చేశాను.. పారిపోయిన ఆ దొంగని ట్రాక్ చేశారు.. ఆ ఆర్డర్ ఇంకా ఉంది.. వస్తుంది అని రిప్లై ఇచ్చారట.. అలా నేను వారం రోజులు వెయిట్ చేశాను.. మళ్లీ జియో మార్ట్ కస్టమర్ కేర్‌ను సంప్రదించాను.. రీఫండ్ చేస్తామని చెప్పారు.. ఆ తరువాత మళ్లీ వారం వెయిట్ చేశాను.. మళ్లీ కస్టమర్ కేర్‌కు కాల్ చేశాను.. రీఫండ్ ప్రాసెస్ట్ స్టార్ట్ అయిందని చెప్పుకొచ్చారు.. మళ్లీ ఓ వారం వెయిట్ చేశాను.. కానీ విషయం ముందుకు జరగలేదు.. మళ్లీ వెయిట్ చేయమన్నారు.. ఇంకా వెయిట్ చేస్తూనే ఉన్నాను.. మనీ పంపలేదు.. ఏం పంపలేదు అని కస్తూరీ తనకు ఎదురైన అనుభవాన్ని పంచుకున్నారు. అయితే తాజాగా జియో మార్ట్ నుంచి అప్డేట్ వచ్చిందట. త్వరగా సమస్యను పరిష్కరిస్తామని మాటిచ్చారట. మొత్తానికి సెలెబ్రిటీలు మాత్రం తమకు ఇలా ఎక్కడైనా సేవల్లో అంతరాయం కలిగితే వెంటనే సోషల్ మీడియా వేదికగా చెబుతున్నారు. ఇండిగో సంస్థ మీద అయితే దాదాపు సెలెబ్రిటీలంతా కూడా కంప్లైంట్స్ చేస్తూనే ఉంటారన్న సంగతి తెలిసిందే.